క్లుప్తంగా

గుండెనొప్పితో మున్సిపల్ ఉద్యోగి మృతి


సీహెచ్‌వీవీ ప్రసాద్

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సీహెచ్‌వీవీ ప్రసాద్ గురువారం మృతి చెందారు. ఉదయం కార్యాలయానికి రావడానికి సిద్ధమవుతున్న సమయంలో గుండెనొప్పి రావడంతో ఒకసారిగా కుప్పకూలి మృతి చెందినట్టు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, గోకిన సునేత్రదేవి, పలువురు కౌన్సిలర్లు సంతాపం తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయం

సామర్లకోట: స్థానిక పెన్షన్‌లైన్ సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద గురువారం రాత్రి రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరి తలకు బలమైన గాయం అయింది. ఒక పెంపుడు కుక్క తరుచూ మరొకరి ఇంటికి వెళ్లి పాడు చేస్తోంది. దీనిపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కుక్క యజమానిని పోలీసులు మందలించారు. ఈ మేరకు గురువారం రాత్రి రెండు కుటుంబాల తిరిగి ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఫిర్యాదుదారు కుటుంబానికి చెందిన కందెల్ల బాగిరాజుకు తలకు బలమైన గాయం అయింది. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


శంఖవరం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

శంఖవరం: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్ఆర్‌వీ సత్యనారాయణ సూచించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 20 మంది గర్భిణులకు డాక్టర్ రామ్‌రాజీవ్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి


కిర్లంపూడిలో బైక్ ర్యాలీ చేస్తున్న ముద్రగడ గిరిబాబు, పార్టీ శ్రేణులు

కిర్లంపూడి: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించి మేలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం తనయుడు గిరిబాబు పిలుపునిచ్చారు. కిర్లంపూడిలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. పేదలకు గతంలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందజేశారని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. తొలిత పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల మీదుగా వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1131 మంది ఓటింగ్

జగ్గంపేట: నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పీఓ, ఏపీఓ, ఓపీఓ, ఎస్సెన్షియల్ ఓటర్లు మొత్తం 1769 మంది ఉండగా 1131 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారని జగ్గంపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారంతో పోస్టల్ బ్యాలెట్ గడువు ముగియడంతో బ్యాలెట్ బాక్స్‌లకు సీలు వేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఇతర జిల్లాల వారితో కలిపి మొత్తం 1769 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ తీసుకున్నారని తెలిపారు. వీరిలో ఇతర జిల్లాలకు సంబంధించిన ఓట్లు 413 ఉన్నాయని చెప్పారు.

స్థానికతకే పట్టం

- పక్కా లోకల్‌గా వస్తున్న వంగా గీతవైపే ప్రజల మొగ్గు
- అతిథిగా వస్తున్న పవన్ కల్యాణ్‌కు నిరాశేనన్న చర్చ


పిఠాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత

పిఠాపురం: ఈసారి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అందరి దృష్టి కేంద్రీకృతమైన అసెంబ్లీ నియోజకవర్గం పిఠాపురం అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. గత ఎన్నికల్లో భీమవరం, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓడిపోయిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ దఫా పిఠాపురంలో పోటీకి దిగుతుండడమే దానికి కారణం. అయితే పిఠాపురం ప్రజలు అతిథులకు గౌరవమిస్తారు తప్ప ఓటు మాత్రం స్థానికులకే వేస్తారన్న నానుడి ఎన్నో ఏళ్లుగా ఉంది. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న వంగా గీత స్థానికురాలు కావడం, ప్రజల్లో మంచి పేరుండడంతో ఓటర్లు ఆమె వైపే మొగ్గు చూపిస్తున్నారు. అతిథిగా వస్తున్న పవన్‌కల్యాణ్‌కు పిఠాపురంలో ఎదురుగాలి తప్పదని, వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్లీ కొత్త నియోజకవర్గం వెతుక్కోక తప్పదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పక్కా లోకల్‌కే ప్రాధాన్యం

పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటివరకూ జరిగిన ప్రతి ఎన్నికలోనూ స్థానిక అభ్యర్థులకే ప్రజలు పట్టం కట్టారు. అవసరమైతే స్థానికులైన వారిని పార్టీలతో సంబంధం లేకుండా స్వతంత్ర అభ్యర్థులైనా సరే గెలిపించి అసెంబ్లీకి పంపించిన చరిత్ర ఉంది. అంతేకాదు స్థానికంగా ఉంటూ తమతో మమేకమైనవారికే తిరిగి రెండోసారి అవకాశం ఇవ్వడం ఇక్కడి ఓటర్ల తీరు. అలాగే వెన్నా నాగేశ్వరరావుకు మూడు సార్లు, కొప్పన మోహనరావు, పెండెం దొరబాబులకు రెండేసి సార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. ఇప్పుడదే పవన్‌కల్యాణ్‌కు ప్రతికూలాంశంగా మారింది. పవన్‌కల్యాణ్‌కు ఓటేసినా ఆయన హైదరాబాద్‌లో తప్ప ఇక్కడ ఉండరన్నది, ఆయనను సామాన్య ప్రజానీకం కలవాలన్న సాధ్యం కాదన్నది బహిరంగ రహస్యమే. అందుకే పవన్‌కల్యాణ్ ఎంతమంది సినీ యాక్టర్లను తీసుకొచ్చి ప్రచారం చేసినా పిఠాపురంలో పరాభవం తప్పదన్న మాట ప్రజల నుంచే వినిపిస్తుంది.

ప్రచారంలో దూసుకెళుతున్న గీత

జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగి జిల్లా పరిషత్ చైర్మన్ నుంచి ఎంపీ, ఎమ్మెల్యేగా జిల్లా ప్రజలకు సుపరిచితురాలైన వంగా గీతకు ఎన్నికల ప్రచారంలో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. అతిథులు వస్తారు.. వెళతారు.. తాను మాత్రం పక్కా లోకల్ అంటూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత ప్రచారంలో దూసుకుపోతున్నారు. అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం, ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ అండగా నిలవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గీతకు కలిసొచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి. అన్ని కులాల నుంచి ఆమెకు సంపూర్ణ మద్దతు లభిస్తుంది. ప్రత్యర్థి ఎవరైనా గెలుపు మాత్రం తనదేనంటూ వంగా గీత ప్రచారంలో దూసుకుపోతుండడంతో వైఎస్సార్ సీపీ కేడర్‌లో ఉత్సాహం ఉరకలేస్తోంది. ఆమె ప్రచార శైలి చూస్తున్న ప్రతిఒక్కరూ ఆమె గెలుపు నల్లేరుపై నడకేనంటున్నారు. తనకు ఓటేస్తే అందరికీ అందుబాటులో ఉంటానని, పిలిస్తే పలుకుతానంటూ ఆమె తీసుకొచ్చిన స్లోగన్ ప్రజల్లోనూ చర్చనీయాంశమైంది.

పవన్‌కు ఓటేస్తే వర్మకు ఓటేసినట్టేనా...?

పిఠాపురంలో జనసేన ఇన్‌చార్జిగా ఉన్న మాకినీడి శేషుకుమారిని ఇన్నేళ్లు పార్టీ కోసం వాడుకుని సరిగ్గా ఎన్నికల ముందు పక్కన పెట్టేయడంపై వ్యతిరేకత ఉంది. శేషుకుమారి జనసేనకు రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారు. మరోవైపు పవన్‌కు ఓటేస్తే టీడీపీ నేత వర్మకు వేసినట్టేనన్న చర్చ సైతం జనసేనకు ప్రతికూలాంశంగా కనిపిస్తుంది. పవన్ గెలిచినా పాలన తనదేనంటూ వర్మ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండడమే దానికి కారణం. మరోవైపు వర్మ వ్యవహారశైలి ఎలా ఉన్నా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నోరు మెదపలేకపోవడం చూస్తుంటే ఎన్నికల తరువాత పరిస్థితి ఏమిటో ఇట్టే అర్థమవుతుంది. మరోవైపు జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పిఠాపురం ఊసెత్తని పవన్ ఇప్పుడు పిఠాపురంలోనే నా ఇల్లు అనడాన్ని కేవలం ఓట్ల స్టంట్‌గానే స్థానిక ప్రజలు భావిస్తున్నారు. ఆయన అరకొరగా నిర్వహించే తన ప్రచారంలో సైతం కేవలం కాపు నేతలనే వెంటబెట్టుకుని తిప్పుకోవడం, కాపులే తనను గెలిపిస్తారంటూ బాహాటంగా చెబుతుండడంపై ఇతర సామాజిక వర్గాలు మండిపడుతున్నాయి. పైగా స్థానికంగా సరైన నాయకులు కరవై హైదరాబాద్ నుంచి సినీ యాక్టర్లను, బుల్లితెర నటులను తీసుకొచ్చి పిఠాపురంలో ప్రచారం చేయిస్తున్నా ప్రజల నుంచి స్పందన కనిపించకపోవడంతో జనసేన కార్యకర్తలే ముక్కున వేలేసుకుంటున్నారు.

అందుబాటులో ఉంటా.. అవకాశం ఇవ్వండి


పనసపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న దవులూరి దొరబాబు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- పనసపాడు గ్రామంలో విస్తృత ప్రచారం
- పలు ప్రాంతాల్లో ఆయన భార్య ప్రచారం

సామర్లకోట: ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉండి అందరి మన్ననలు పొందేలా పాలన చేస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని పనసపాడు గ్రామంలో వైస్ ఎంపీపీ మలసా శ్రీను పార్టీ నాయకులు బదిరెడ్డి బుజ్జి, శ్రీనుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగింపు, నియోజకవర్గ అభివృద్ధికి స్థానికుడైన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామంలో అడుగడుగునా గ్రామ ప్రజలు దొరబాబుకు నీరాజనాలు పలికారు.

దొరబాబుకు అవకాశం ఇవ్వండి : దవులూరి చంద్రకళ


సామర్లకోట జగనన్న కాలనీలో ప్రచారం చేస్తున్న దవులూరి చంద్రకళ

తన భర్త దవులూరి దొరబాబును ఆశీర్వదించాలని చంద్రకళ ఓటర్లను అభ్యర్థించారు. పట్టణ పరిధిలోని 25, 26 వార్డులతో పాటు జగనన్న కాలనీలో అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి దొరబాబు, గృహసారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కుమార్తె సార్వికలతో కలసి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాతేటి అరుణ్‌కుమార్

సామర్లకోట: కాకినాడ జిల్లా పరిధిలోని అన్ని ఎమ్మెల్యే స్థానాలు, ఎంపీ స్థానం గెలుపు కోసం నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ పని చేస్తుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కాతేటి అరుణ్‌కుమార్ తెలిపారు. మాదిగలు ఐక్యంగా వైఎస్సార్ సీపీకి పని చేయాలని ఇప్పటికే నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గంతో పాటు ప్రతీ నియోజకవర్గంలోను మాదిగలను చైతన్యం చేయడం జరుగుతుందని చెప్పారు. నిరుపేదల పక్షాన నిలబడిన సీఎం జగన్‌కు అండగా ఉండడానికి మాదిగలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర సంఘ నాయకులు చిందాడ చిన్న, వేలంగి సత్తిబాబు, నందిక వీరబాబు, పాలేటి కృపానందం, కె.నాగేశ్వరరావు, గడ్డం రవి, తాతపూడి అప్పారావు, పెదపూడి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు


శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పందిరి రాట వేస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి పదో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి 23 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఆలయ అర్చకులు బుధవారం స్వామివారి బ్రహ్మోత్సవాలకు పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ధర్మకర్తలు మాట్లాడుతూ ఉత్సవాల్లో స్వామివారికి విశిష్ట సేవలు అందించేందుకు 15న భక్తులు గోవిందమాల దీక్షాధారణ చేస్తారన్నారు. అదేరోజు సాయంత్రం శ్రీవారి శోభాయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. 16న క్షీరాభిషేకంతో ఉత్సవ ఆరంభ స్నపనం, పల్లకీసేవ ఉంటుందన్నారు. 19న రాత్రి ఏడు గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం, 20న లక్ష్మీనారాయణ వ్రతం, 23న మహాపూర్ణాహుతి, శ్రీపుష్పయాగం నిర్వహిస్తారని వివరించారు. పాత సంచుల వర్తక సంఘం, గ్రామ ప్రజల సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

'జయలక్ష్మి' బాధితులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



కాకినాడ: జయలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ వల్ల నష్టపోయిన ప్రతి బాధితునికి న్యాయం జరిగే వరకు అన్నివిధాలా అండగా ఉంటానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. బాధితుల తరపున ప్రతినిధులు ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన నేపథ్యంలో గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జయలక్ష్మి బ్యాంక్ ద్వారా దాదాపు రూ.500 కోట్ల మేర నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం అప్పట్లోనే తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎంతో మంది విశ్రాంత ఉద్యోగుల కష్టార్జితం, పింఛన్ సొమ్మును ఆ బ్యాంక్‌లో డిపాజిట్ చేశారని, అది మూతపడడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వెంటనే ఆ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల ఎస్పీలతో సిట్ ఏర్పాటు చేయించి డీఐజీ స్థాయి ఉన్నతాధికారితో విచారణ జరిపించి, నిర్వాహకులను అరెస్టు చేయించానన్నారు. ఆ మేరకు రూ.500 కోట్ల ఆస్తులకు సంబంధించి ఆస్తుల అటాచ్‌మెంట్ కూడా చేయించామన్నారు. సీఐడీ కోర్టు అనుమతి వచ్చిన వెంటనే బాధితులందరికీ న్యాయం జరిగేలా గట్టిగా పోరాడతానన్నారు. అలాగే ఎస్ఈజెడ్ భూములను వెనక్కి ఇచ్చిన నేపథ్యంలో సుమారు 18 ఎకరాల భూమి వచ్చే అవకాశం ఉందని, దీని ద్వారా రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు అటాచ్‌మెంట్ ద్వారా న్యాయం జరగవచ్చునన్నారు. అందువల్ల బాధితులు ధైర్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జయలక్ష్మి బ్యాంక్ బాధితుల విషయంలో సీఎం జగన్, పార్టీ ప్రాంతీయ పరిశీలకులు మిథున్ రెడ్డి, ఎంపీ వంగా గీత, తనతోపాటు రూరల్ ఎమ్మెల్యే కూడా అండగా నిలిచి భరోసాగా నిలిచామన్నారు.

ఫ్యాను ప్రభంజనం ఖాయం


దుర్గాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత


ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- దుర్గాడ, శ్రీరాంపురం, పాత ఇసుకపల్లి, కొత్త ఇసుకపల్లిల్లో ప్రచారం

గొల్లప్రోలు: రానున్న ఎన్నికల్లో మళ్లీ ఫ్యాను ప్రభంజనం ఖాయమని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని దుర్గాడలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు అందించి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. గత ఐదేళ్లలో అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించి రాష్ట్రానికి స్వర్ణయుగాన్ని తీసుకొచ్చిన జననేత జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో పేదలను పట్టించుకోకుండా జన్మభూమి కమిటీలకు ప్రజాధనాన్ని దోచిపెట్టారని విమర్శించారు. జనసేన, టీడీపీ నాయకులు చెప్పే అబద్ధాలను నమ్మొద్దన్నారు. జగనన్న పాలనలో ఇంటింటికీ మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. ఆశీర్వదించండి

కొత్తపల్లి: అందరికీ అందుబాటులో ఉంటానని, ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని శ్రీరాంపురం, పాత ఇసుకపల్లి, కొత్త ఇసుకపల్లిలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోసం రంగులు పూసుకుని వచ్చే వారిని నమ్మొద్దన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఎక్కడ ఓడిపోతామోనని హైదరాబాద్ నుంచి సినీ యాక్టర్లను తీసుకొచ్చి ప్రచారం చేయిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రావి రమేష్, సన్నిబోయిన రిబ్కా, ఎంపీటీసీ సభ్యుడు గుర్రాల మంగతాయారు, గుర్రాల తాతారావు, ఎరకం నూకారెడ్డి, సన్నిబోయిన ఎలీషా, ఎరకం దివాకర్‌రెడ్డి, గుల్లపల్లి వీరభద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ బాధ్యత సిబ్బందిదే

- రీ పోల్‌కు అవకాశం ఇవ్వొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్


పెద్దాపురం ఓపీఓల శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

పెద్దాపురం: ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించే సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన అవసరమని, ఎన్నికల నిర్వహణ బాధ్యత పీఓ, ఏపీఓ, ఓపీఓలపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అన్నారు. పెద్దాపురం లూథరన్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఓపీఓల శిక్షణ తరగతులను గురువారం ఆయన పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు లోబడి సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిబ్బంది ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని, కమిషన్ నిబంధనలపై మరింత పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ నివాస్ ఆదేశించారు. పోలింగ్ సమయంలో పీఓ, ఏపీవోలతో పాటు ఓపీఓలు సమన్వయంతో పని చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందు నిర్వహించే మాక్‌పోల్ అత్యంత కీలకమని, సిబ్బంది అప్రమత్తత అవసరమన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరు, పీఓ డైరీ, ఇతర డాక్యుమెంట్లు పూర్తి చేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ సీతారామారావు, ఆర్డీవో కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పెద్దాపురం, సామర్లకోట తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మారావు, రామారావు, డిప్యూటీ తహసీల్దార్ పద్మజ, భానుకుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌కు పక్కా ఏర్పాట్లు

స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్ఓ, ఆర్డీఓ జేఎస్ రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే పోలింగ్ సిబ్బందికి, ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రెండు రోజుల ముందు నుంచే పోలింగ్ బూత్‌ల పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని ఆర్ఓ రామారావుతో కలిసి పరిశీలించారు. కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, డీటీ భానుకుమార్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యకు మోక్షం


అమ్మాణమ్మ అపార్టుమెంటువాసుల కోసం నిర్మించిన సీసీ రోడ్డు

- పుంత రోడ్డుకు తప్పిన వెతలు
- టీడీపీ హయాంలో పట్టించుకోని రాజప్ప
- దవులూరి చొరవతో ఎఫ్‌సీఐ, అపార్ట్‌మెంట్ల రోడ్లకు మోక్షం

సామర్లకోట: స్థానిక జగ్గమ్మగారిపేటలోని అమ్మాణమ్మ అపార్టు వాసుల దీర్ఘకాలిక సమస్యకు మోక్షం లభించనుంది. 916 ఇళ్ల సముదాయంతో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అపార్టుమెంట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే తదనంతరం ఆ పనులు మందకొడిగా సాగాయి. కాగా తెలుగుదేశం అధికారంలోనికి వచ్చిన తరువాత 2016లో అప్పటి ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అపార్టుమెంటును ప్రారంభించారు. అయినప్పటికీ అపార్టుమెంటు వాసులు రాక పోకలు సాగించడానికి పుంత రోడ్డు మాత్రమే ఉంది. వర్షం వస్తే బురదతో నిండి పొయి తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. రాజప్ప ఉప ముఖ్యమంత్రిగా ఉన్నా రోడ్డుపై ఎటువంటి శ్రద్ధా చూపలేక పోయారు. బురదలో రాకపోకలు సాగించలేని అపార్టుమెంటు వాసులు సమీపంలో ఉన్న ప్రైవేటు లే అవుట్ మీదుగా రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్‌లకు చేరు కోవడానికి రాకపోకలు సాగించేవారు. దాంతో అదనంగా మూడు కిలో మీటర్ల దూరాభారాన్ని భరించాల్సి వచ్చేది.

అపార్టుమెంట్లకు సీసీ రోడ్డు నిర్మాణం

అమ్మాణమ్మ అపార్టుమెంటు సమీపంలోనే 436 ఇళ్ల సముదాయంతో టిడ్కో ఇళ్లు పూర్తి కావడంతో రోడ్డు నిర్మించాలని టీడీసీ నాయకులు ప్రయత్నం చేశారు. దాంతో వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత మున్సిపల్ నిధులు రూ.1.5 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం చేసి అమ్మాణమ్మ అపార్టుమెంట్, టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల రోడ్డు సమస్యను వైఎస్సార్ సీపీ పాలనలో పరిష్కరించారు.

ఎఫ్‌సీఐ రోడ్డుకు మోక్షం...

పెద్దాపురం నియోజకవర్గంలో 2015 నుంచి నిమ్మకాయల చినరాజప్ప హోమ్ మంత్రి డిప్యూటీ సీఎంగా ఉండి బురద హయంగా ఉన్న ఎఫ్‌సీఐ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చి వదలివేశారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోని వచ్చిన తరువాత కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు దృష్టిలో ఉన్న ఎఫ్‌సీఐ రోడ్డు సమస్యను పరిష్కరించడానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు మున్సిపాలిటీకి మంజూరైన రూ.కోటితో సీసీ రోడ్డు నిర్మించారు. దాంతో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే ఎఫ్‌సీఐ ఉద్యోగులు, కార్మికులు, రైల్వే విద్యుత్తు సబ్ స్టేషన్ ఉద్యోగులు, కార్మికులు, కాన్వెంట్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చెరకు అభివృద్ధి మండలి కార్యాలయ ఉద్యోగుల సమస్యలతో పాటు సత్యనారాయణపురం ప్రజలకు ఎంతో మేలు కలిగింది. వీటితో పాటు పలు వార్డులలో అనేక సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేశారు.

రోడ్డు నిర్మాణంతో ఎంతో మేలు

అయోధ్యరామపురం నుంచి అమ్మాణమ్మ అపార్టుమెంట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేయడంతో టిడ్కో లబ్ధిదారులు, అమ్మాణమ్మ అపార్టుమెంట్ లబ్ధిదారుల సమస్యకు మోక్షం లభించింది. రాజప్ప హోమ్‌మంత్రిగా ఉండగా రోడ్డు నిర్మాణంపై శ్రద్ధ చూపలేదు. దవులూరి దొరబాబు కృషితో రోడ్డు నిర్మాణం పూర్తయింది.

– పాగా సురేష్‌కుమార్, 31వ వార్డు కౌన్సిలర్, సామర్లకోట

హామీ ఇచ్చి వదిలేశారు..

పట్టణంలో ఎంతో ముఖ్యమైన ఎఫ్‌సీఐ రోడ్డు గోతులతో బురద మయంగా తయారు కావడంతో అనేక మంది ఇబ్బందులకు గురయ్యే వారు. రాజప్ప హోమ్ మంత్రిగా ఉండి రోడ్డును పరిశీలించి రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేస్తే దొరబాబు ఆ పనిని పూర్తి చేశారు.

– సేపెని సురేష్, 23వ వార్డు కౌన్సిలర్, సామర్లకోట